# శ్రావణి

- లయన్. కాకరపర్తి సుబ్రహ్మణ్యం



ఆదివారం ఉదయం సమయం పన్నెండు కావొస్తుంది. తిరుపతి నుంచి వచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురుచూస్తున్నారు. రైల్వే ఫ్లాట్ ఫాంపై ప్రయాణీకులు. ఆరోజు రష్ ఎక్కువగా వుంది. స్టేషన్ బయట బైక్ పార్కింగ్ చేసి హడావుడిగా టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వైపు నడిచాడు శరత్ వెంకన్న దర్శనానికి వచ్చిన భక్తుల క్యూలో ఉండి. ఆ క్యూలో టికెట్ వచ్చేలోగా ట్రైన్ వచ్చి వెళ్ళిపోవటం ఖాయం అనిపించి తెలిసిన పోర్టర్ ఎవరైనా కనిపిస్తారేమోనని చూస్తున్నాడు. "నమస్తేసార్! ఏంటి యిలా వచ్చారు?" అంటూ పోర్టర్ పలకరించేసరికి కావలసిన ప్లాట్‌ఫారం టికెట్ చేతిలోనే వున్నట్టు ఫీలయ్యాడు శరత్. అతని చేతిలో ఓ ఐదు నోటుంచిన రెండు నిమిషాల్లో టికెట్ తెచ్చి చేతిలో పెట్టాడు పోర్టర్.

ప్లాట్‌ఫారం మీదకి వెళ్ళేముందు బండి లేటేమైనా వుంటుందేమోనని నోటీసు బోర్డులో చూశాడు. ఇరవై నిమిషాలు ఆలస్యంగా వస్తుందని వ్రాసారు. ఉదయం నుంచి ఏమీ తినలేదని గుర్తుకొచ్చి రైల్వే క్యాంటీన్ కెళ్ళి లైట్‌గా టిఫిన్ చేసి వచ్చి ట్రైన్‌కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. పదే పదే టైమ్ చూసుకుంటూ టెన్షన్ ఫీలవుతున్నాడు. ట్రైన్ వచ్చేస్తుందన్న ఎనౌన్స్‌మెంట్ వినిపించగానే శరత్ గుండె రైలింజన్‌లా యింకా వేగం పుంజుకుంది. ట్రైన్ రాగానే తను ఏం చేయాలా అని ఆలోచనలో పడ్డాడు. ఒక్కసారి విషయం గుర్తుకు తెచ్చుకోవాలనే ప్రయత్నంలో జరిగినవన్నీ గుర్తుకురాసాగాయి.

డిగ్రీ పూర్తిచేసి తన తండ్రి చేస్తున్న బిజినెస్‌లో తన సహకారం అందిస్తూ తనుకూడా బిజినెస్ వ్యవహారాలు చూసే స్థాయికి చేరుకున్నాడు శరత్. ప్రతివారం మార్కెట్‌లోకి వచ్చేవివిధ పత్రికలు చదవటం అలవాటు శరత్‌కి. వాటిలో కథలు, కవితలు ఒకటేంటి అన్ని శీర్షికలు వదలకుండా చదవటం ఇష్టం. ఓ రోజు యధాప్రకారం ఓ మాసపత్రిక తిరగేస్తుంటే "పెన్ ఫ్రెండ్స్" కాలమ్ దగ్గర టక్కున ఆగిపోయాయి అతని కళ్ళు. అందులో శ్రావణి అనేపేరు, హాబీలు చూసి మళ్ళీ మళ్ళీ చదివాడు. తనవి శ్రావణి హాబీలు అచ్చుగుద్దినట్టు ఒకే విధంగా వుండటమే అందుకు కారణం. వెంటనే వైట్ పేపర్ తీసుకొని తన పరిచయంతో శ్రావణికి చక్కని లెటర్ వ్రాసి కవర్‌ను గమ్‌టేపుతో అంటిం

చాడు. కవర్‌కి రెండు వైపులా మనసుకు హత్తుకునేలా డిజైన్స్ గీసి బోర్డర్‌కు స్కెచ్‌తో కలర్స్ వేసి అందంగా తయారు చేసి కవరు పోస్ట్‌చేశాడు. లెటర్స్ ద్వారా ఒకరికొకరు పరిచయం బాగా పెరిగింది. అప్పుడప్పుడు శ్రావణికి వ్రాసే లెటర్స్‌లో మిమ్మల్ని ఒక సారి చూడాలనివుంది అని వ్రాయా లనిపించినా మనసు ఎందుకో వెనుకంజవేసేది. ఆ సాహసం చేయలేక పోయాడు.

**శుభాభినందనాలు**

పార్థివ నామ సంవత్సరం నుండి ప్రారంభమవుతున్న యీ 'మహాయజ్ఞం' నిర్విరామంగా కొనసాగాలనీ, ప్రతి తెలుగు లోగిలినీ సాహితీ సుమాలతో అలరించాలనీ కోరుకుంటూ శుభాభినందనలతో...

**శ్రీధరరావు**

BHEL, హైదరాబాద్

శ్రావణి దగ్గరనుంచి ఒక రోజు లెటర్ వచ్చింది. అందులో "డియర్ శరత్ నేను మిమ్మల్ని చూడాలనుకుంటున్నాను. మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తాను. నన్ను ఎలా కలుసుకోవాలో మరో ఉత్తరంలో తెలియచేస్తాను" అని వ్రాసింది. అది చదివిన శరత్‌కు హాయిగా ఆనందంగా అనిపించింది. తన మనసులో వున్న ప్రపోజల్ అటువైపు నుండే ముందుగా వచ్చినందుకు మనసులోనే శ్రావణికి థ్యాంక్స్ చెప్పుకున్నాడు.

స్నేహాన్ని ప్రేమగా భావించి కొందరు తప్పు అంచనా వేసుకుంటుంటారు. కానీ తనది మాత్రం స్నేహానికి వున్న విలువలను దానికున్న అర్థాన్ని చెడిపోకుండా స్నేహం చేసే మనస్తత్వం. ఇంతకాలం శ్రావణికి ఎన్నిలెటర్స్ వ్రాసినా ఎప్పుడూ అర్థం లేని మాటలు కానీ అనవసరమైన విషయాలుకానీ వ్రాయలేదు. ఆమె వ్రాసేలెటర్స్‌లోనే కొంచెం ప్రేమ భావన కనిపించేది. ఆలోచనలకు ఫుల్‌స్టాప్‌పెట్టి మీకు నా హృదయపూర్వక ఆహ్వానం అంటూ రిప్లై యిచ్చేశాడు శరత్.

వారం తర్వాత శ్రావణి దగ్గరనుంచి లెటర్ వచ్చింది. అది చూస్తూనే అందులో ఏముందో చదవాలనే తొందర. "డియర్ ఫ్రెండ్. వచ్చే వారం కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు మీ వూరొస్తున్నాను. నన్ను ఎలా గుర్తించాలా అనుకుంటున్నారా? ఆకుపచ్చ కలర్ చీర, మెరూన్ కలర్ హ్యాండ్ బ్యాగ్‌తో చేతిలో ఏం వుంటుందో చెప్ప గలరా? వద్దులే మిమ్మల్ని ప్రశ్నలతో యిబ్బంది పెట్టను. మీరు అందమైన డిజైన్స్‌గీసిన కవర్ పట్టు కుని వుంటాను. మనం కలుసుకోవటం యిదే మొదటి సారైనా తప్పక ఒకరినొకరు ఇద్దరం గుర్తించగలం అనుకుంటున్నా. ఇంకొంచెం వివ రంగా చెప్పాలంటే నా కుడి చెంపపై బ్యూటీస్పాట్‌లా ఒక చిన్న పుట్టుమచ్చ వుంది. యిలా కూడా నన్ను తెలుసుకోవచ్చు. నేను మళ్ళీ సాయంత్రం ట్రైన్‌కి వెళ్ళిపోతాను". ఇదీ అందులో వున్న మేటర్. ఆ రోజురానే వచ్చింది. తను స్టేషన్‌కి వచ్చాడు. ఇక ట్రైన్ రావడం శ్రావణిని కలవటమే ఆలస్యం.

నిండు చూలాలి ప్రసవ వేదనలా క్రిక్కిరిసిన ప్రయాణీకులతో నిండిన బోగీలు మోసుకుంటూ స్టేషన్‌లోకొచ్చి ఆగింది కృష్ణా ఎక్స్‌ప్రెస్. శ్రావణి కోసం అన్నివైపులా వెతుకుతున్నాయి అతనికళ్ళు. చివరి బోగీలోనుంచి దిగుతున్న శ్రావణి నన్ను గుర్తించటానికి వివరాలు వ్రాసానుకానీ శరత్‌ని గుర్తించటానికి ఏం చేయాలో, ఎలా గుర్తుపట్టాలో అతను వ్రాయలేదు. నేనూ అడగలేదు అనుకుంటూ అక్కడవున్న వాళ్ళలో శరత్‌ని తనే ముందుగా తెలుసుకోవాలనే ఆలోచనతో నడుస్తూవుంది.

"హలో! శ్రావణిగారూ!" అనే పిలుపు వినగానే తనను పిలిచింది ఎవరో తెలుసు అన్నట్లు ఆ వైపు తిరిగింది. శ్రావణిని అలా చూసిన మరుక్షణం తన ప్రమేయం లేకుండానే తన మనసుకు "బ్యూటిఫుల్" అనిపించింది. తెల్లని పాలరాతిశిల్పంగా అబ్బురపరిచే అందం. ఎత్తుకు తగిన పర్సనాలిటీ, చక్కని రూపంలో చూడముచ్చ టగా వుందనిపించిదతనికి. మీరూ... అనే లోపు "నేనేనండి శరత్‌ని" అని పరిచయం చేసుకున్నాడు. ఇద్దరూ బైక్‌మీద దగ్గరలో వున్న ఏ.సి. రెస్టా రెంట్‌లోకి వెళ్ళారు. లోపల తక్కువ

ఉగాదికి విజయవాడ నుండి రాబోతున్న 'చినుకు' సాహిత్య మాస పత్రికకు మా సాదర స్వాగతం.
పాఠకులకు ఉగాది శుభాకాంక్షలతో...
**వింజమూరి అచ్యుతరామయ్య**
హైద్రాబాద్

సౌండ్‌తో 'వసంతం' చిత్రంలోని 'నినుచూడక ముందర తెలియదులే యింతందం వున్నదని' పాట వీనులవిందుగా విని పిస్తూ వుంది. ఇద్దరు ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు.

శ్రావణి గారూ నాకు తెలిసిన మీ అభిరుచుల ప్రకారం మీరు యిప్పుడు పెసరట్టు ఆర్డర్ చేస్తారు అవునా అనగానే శరత్‌తో మనం ఇద్దరం బెస్ట్ ఫ్రెండ్స్. సారీ సారీ బెస్ట్ పెన్ ఫ్రెండ్స్‌గా వున్నాం. మనగురించి మనకి అవగాహన వుంది కనుక ఇక నుంచి మీరు, గారు అని పిలవకండి అంది శ్రావణి. 'నాకు చెప్పారు బాగానే వుంది. మరి మీరో అండీ అని పిలుస్తున్నారు అన్నాడు. ఇద్దరూ ఒక్కసారిగా నవ్వుకున్నారు.

ఇద్దరు టిఫిన్ చేస్తూ సరదాగా అనేక విషయాలు చర్చించుకున్నారు. కాఫీ ఆర్డర్ చేశారు. శరత్ నువ్వేమి అనుకోనంటే నీకో ముఖ్యవిషయం చెప్పాలి అంది శ్రావణి. 'మనం యింత త్వరగా కలుస్తా మనుకోలేదు. తప్పనిసరి పరిస్థితులలో యిలా రావలసి వచ్చింది' అంటున్న శ్రావణితో 'ఏం పర్వాలేదు నువ్వేం చెప్పదలుచుకున్నా నిర్భయంగా చెప్పొచ్చు' అన్నాడు.

శరత్ నీకు ఎలా చెప్పాలో తెలియటంలేదు. నేను వ్రాసిన లెటర్స్ ద్వారా నీకు మా ఫ్యామిలీ వివరాలన్నీ తెలుసుకదా! మా అక్కపెళ్ళి కుదిరింది. రేపు ఉదయం నిశ్చయ తాంబూలాలు. ఇప్పుడు సమయానికి కట్నకానుకలకు డబ్బు లేకపోయినా మంచి సంబంధం వచ్చిందని యింకొక నెల తర్వాత పంటలు అమ్మితే వచ్చే డబ్బులతో పెళ్ళి చేయచ్చని మా నాన్న యీ సంబంధం మాట్లాడారు. వచ్చే నెలలో పెళ్ళి చేసేందుకు ముహూర్తాలు పెట్టు కున్నారు. తాంబూలాల సమయంలో మగ పెళ్ళి వారికి యాభై వేలు యిస్తామని నాన్న మాటిచ్చారు. సమయానికి అంత డబ్బు సర్దుబాటు కాలేదు. నాన్నకు తెలిసిన వాళ్ళ దగ్గర 30 వేలు తెచ్చారు. మిగతా 20 వేలు నేను మీ దగ్గర తెస్తా నని చెప్పి మీరు యిస్తారనే నమ్మకంతో వచ్చాను. మా అక్కపెళ్ళి ఆగిపోకుండా ఎలాగైనా మీరు సహాయం చెయ్యండి. వచ్చేనెల 20 వేలు అక్కపెళ్ళి కార్డుతో పాటు నేనే స్వయంగా తెచ్చి స్తాను అంది శ్రావణి.

ఇంతకుముందు తనతో ఆమెకు ఎక్కువ పరిచయం లేకపోయినా ధైర్యంగా పెద్ద మొత్తంగా డబ్బు అడుగుతున్నందుకు శరత్ ఒక్కక్షణం ఆలోచనలో పడ్డాడు. అందరిని తప్పుగా అర్థం చేసుకొని అనుమానిస్తే ఆ లోకంలో స్నేహాన్ని, స్నేహితులని నమ్మలేం. ఒక శుభకార్యం ఆగిపో కుండా సహాయం చేయాలనుకోవటం తనకు ఆత్మ సంతృప్తి అనిపించింది. ఆలోచనలు కట్టిపెట్టి ఆమెతో నువ్వడిగిన ఇరవైవేలు యిచ్చి పంపిస్తాను సరేనా అన్నాడు. తానొచ్చిన పని పూర్తవుతుందన్న సంతోషం శ్రావణి కళ్ళలో కనిపించింది.

ఆమెను రెస్టారెంట్ నుంచి స్టేషన్‌కి తీసుకెళ్ళి వెయిటింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి డబ్బుకోసం బయలుదేరాడు. తనకింకా పెళ్ళికానందున అటు వంటి బరువు, బాధ్యతల గురించి అవగాహన కలిగిన మిత్రులను కలిసి ఆమెకు డబ్బు యివ్వటం గురించి సలహా అడిగాడు. ఇద్దరు యిదంతా పెద్ద నాటకం, ముక్కూ మొహం తెలియని మనిషి యింత పెద్ద మొత్తంగా డబ్బు అడుగుతుందంటే యిందులో ఏదో మోసం వుందని అన్నారు. ఒక్కడు మాత్రం ఆ అమ్మాయికి డబ్బిచ్చి సహాయం చేయాలని సలహా యిచ్చాడు. నేటి సమాజంలో ఆడపిల్ల పెళ్ళి చేయాలంటే ఎన్ని కష్టాలు ఎదురవుతాయో వారి తల్లిదండ్రులకే తెలుసునని యీ పెళ్ళి జరగాలంటే

తప్పక సహాయం చేయమని, యితరుల మాటలను పట్టించుకోవద్దని మంచిగా చెప్పాడు. ఇక ఆలస్యం చేయకుండా డబ్బు తెచ్చియిచ్చి ఆమెను రైలెక్కించి పంపించాడు.

చక్కని ఆతిథ్యాన్ని యిచ్చి, అక్కపెళ్ళికోసం అడిగిన వెంటనే సహాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వెళ్ళిన తర్వాత ఓ లెటర్ వ్రాసింది శ్రావణి. ఆ తర్వాత శ్రావణి వ్రాసిన ముహూర్తం తేది దాటి వారం రోజులైనా శుభలేఖ గాని, లెటర్ గానీ రాలేదు. డబ్బు లేక పెళ్ళివాయిదా పడిందేమోననే సందేహం కలిగినా అలా జరిగివుంటే ఆమె లెటర్ వ్రాసేది కదా అని శరత్ తనని తాను సమాధాన పరుచుకున్నాడు.

ఆ మరుసటిరోజు శ్రావణి తన అక్క, బావలను వెంటబెట్టుకుని శరత్ వద్దకు వచ్చింది. అలా వాళ్ళను చూడగానే సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. పెళ్ళికి కార్డు పంపిస్తానని ఏకంగా వధూవరులనే వెంట బెట్టుకొచ్చారు ఏమిటి విశేషం అంటున్న శరత్ మాటలకు అడ్డొస్తూ పనులు వత్తిడివలన స్వయంగా రాలేక శుభలేఖ మీకు పోస్ట్ చేశాం. మీరు పెళ్ళికి తప్పక వస్తారని మేమంతా ఎదురుచూశాం. మీరేదో బిజీలోవుండి రాలేకపోయారనుకున్నాం కానీ మీకసలు శుభలేఖ చేరలేదనే విషయం యిప్పుడే తెలిసింది. ఏది ఏమైనా మీరు చేసిన సాయం మరువ లేనిది. మీ సహాయం వలన అక్కపెళ్ళి ఆనందంగా జరిగింది. ఇదిగో మీరిచ్చిన యిరవైవేలు అంటూ దానితోపాటు ఒక బరువైనప్యాకెట్‌కూడా యిచ్చింది శ్రావణి. యిదేంటండీ నేను యిచ్చిన దానికి వడ్డీనా అంటే అదేం కాదు మంచి మనసుతో మీరందించిన సహాయానికి చిరుకానుకగా యీ స్వీట్ ప్యాకెట్ యిచ్చాం అంతే అని చెప్పారు. వారికి మంచి ఆతిథ్యాన్ని యిచ్చి ట్రైన్ ఎక్కించి వీడ్కోలు పలికాడు శరత్.

❖ ❖ ❖


## చేతనతో వర్షిస్తున్న కళారూపం 'కళావర్షిణి'

ఆంధ్రాలో అందునా విజయవాడలో అద్భుతమైన పెయింటింగ్స్, రోజ్ ఉడ్ ఫర్నీచర్‌తో చేసిన అందమైన డైనింగ్ సెట్, డబుల్‌కాట్, నగిషీ ఉయ్యాల... మామూలు ప్రదర్శన అనుకుని వెళితే ఒక్క క్షణం మనం ముగ్ధులమవుతాం.

మళ్ళీ వెంటనే బయటకు వచ్చి ఆ ప్రదర్శన బోర్డును పరికిస్తే... "కళావర్షిణి" మనలను సాదారంగా తిరిగి లోపలికి ఆహ్వానిస్తుంది. తంజావూర్ ఆర్ట్, రవివర్మ చిత్రాలు, మనకి కావలసిన వస్తువు యొక్క ఆలోచన చెబితే అద్భుతమైన రీతిలో మనకి అందజేసే నైపుణ్యం మనలను అబ్బుర పరుస్తుంది.

చిన్న చిన్న గిఫ్ట్ ఆర్టికల్స్ మొదలుకొని పెద్ద పెద్ద చిత్రాల దాకా ప్రతి ఒక్క దానిలోను సౌందర్యం దోబూచులాడుతోంది. స్వయంగా ఈ కళ పట్ల ఆసక్తి వలన 'కళావర్షిణి' నిర్వాహకురాలుశ్రీమతి **లతారాణి**గారు వ్యాపారం వలే కాక, ఒక కళాదృష్టితో దీనిని నిర్వహించడం విశేషం. అంతేకాదు దేవాలయాలకు సంస్థలకు తగురీతిలో తగ్గిస్తానంటున్న ఈమె తంజావూరు కళలో స్వయంగా అభినివేశం ఉన్న కళాకారిణి. ఒక్కసారైనా ఈ **'కళావర్షిణి'** దర్శిస్తే... 'కళ' యొక్క చేతనా రూపం నిత్య వర్షమై మనలని ఆనందపరవశులని చేస్తుంది.

**కళావర్షిణి, 2వ అంతస్థు, రామకృపా కాంప్లెక్స్, బెంజిసర్కిల్, విజయవాడ.**